
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 1 జనవరి 2024



నూతన సంవత్సర శుభాకాంక్షలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటఅర్బన్, డిసెంబరు 31: జిల్లా ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్తఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని, అందరికి మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు.

మార్పుకు శ్రీకారం

- నూతన సంవత్సరంలో ప్రజలు సంతోషంగా ఉండాలి
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకెళ్తుంది
- గత ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్ల అప్పుల భారం మోపింది
- అయినా ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తాం
- ప్రతినెలా 1వ తేదీన జీతాలు ఇచ్చేలా కృషి చేస్తున్నాం
- ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను తీసుకొస్తాం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్‌లో కార్యకర్తలు, ప్రజల సమక్షంలో నూతన సంవత్సర కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి ప్రభాకర్

హుస్నాబాద్, డిసెంబరు 31 : మార్పునకు శ్రీకారం చుట్టిన సంవత్సరం 2023 అని, దానికి సంతోషంగా వీడ్కోలు పలుకుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త ప్రభుత్వం ముందుకు సాగుతుందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజల సమక్షంలో 2024 నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరంలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కొత్త ప్రభుత్వం వచ్చి 20 రోజులు కాకముందే బీఆర్‌ఎస్ నాయకులు అనేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని రూ. 7లక్షల కోట్ల అప్పుల్లోకి తీసుకెళ్లిన ఘనత వారిదన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు ఇచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. విద్యకు ప్రాముఖ్యత ఇస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ చేయబోతున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి గ్యారంటీని తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఈ సంవత్సరంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. ఎన్నికల ముందు స్థానిక మ్యానిఫెస్టో విడుదల చేశామని, దానిని అమలు చేయడమే తన ముందున్న కర్తవ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, జడ్పీటీసీ గీకురు రవీందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, జిల్లా నాయకులు కర్ణకంటి మంజులారెడ్డి, ఎండీ హసన్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, మండలాల అధ్యక్షులు బంక చందు, ధర్మయ్య, తిరుపతిరెడ్డి, అయిలయ్య, డాక్టర్ అక్కు శ్రీనివాస్, ఇంద్రాసేనారెడ్డి, సంతాజీ, రమేశ్‌నాయక్, నర్సాగౌడ్, రాధ ఉన్నారు.

జీవో 317 బాధితులకు న్యాయం చేస్తాం

జీవో 317 బాధితులకు ప్రభుత్వం తప్పక న్యాయం చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హామీ ఇచ్చారు. హుస్నాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పోలీసులు, ఉపాధ్యాయ బాధితులు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 317 జీవో తమకు తీవ్రంగా నష్టం చేసిందన్నారు. దూరప్రాంతాల్లో పని చేయలేక కొంత మంది ఉద్యోగులు గుండెపోటుతో మరణించారని తెలిపారు. బాధితులకు ప్రభుత్వం సత్వర న్యాయం చేస్తుందని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామి ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జీవో 317 బాధితుల సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బూట్ల రాజమల్లయ్య, దత్తాద్రి, నాయకులు శ్రీనివాస్ వినీత్, కాయిత శ్రీనివాస్, భాస్కర్, మల్లయ్య, లక్ష్మారెడ్డి, సాజిద్‌తో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.



జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని మంత్రిని కోరుతున్న పోలీసు సిబ్బంది

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ 2024 క్యాలెండర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు శంకర్ నాయక్, వెంకటేశ్, కిషన్‌నాయక్, సోములు నాయక్, శంకర్‌నాయక్, కాళిదాస్, తిరుపతి, స్వరూప, సరస్వతి, బిక్షపతి, ధరావత్ తిరుపతినాయక్ తదితరులున్నారు.

ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన హుస్నాబాద్‌కు చెందిన పురోహితులు రామక చంద్రమౌళిశర్మ కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. చంద్రమౌళి శర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఆయన వెంట స్వార్థి అసోసియేషన్ అధ్యక్షులు పందిల్ల శంకర్, మేకల వీరన్నయాదవ్, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి తదితరులున్నారు.

అండగా ఉంటా..న్యాయం చేస్తా


అక్కన్నపేట, డిసెంబరు 31 : గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యలు అన్ని తన దృష్టిలో ఉన్నాయని, ఇటీవలే ప్రాజెక్టుకు సంబంధించి సమీక్ష కూడా నిర్వహించానని, కొంచెం ఓపిక పడితే అండగా ఉండి అందరికీ న్యాయం చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లో గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన పెళ్లయిన నిర్వాసిత మహిళలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. 18 సంవత్సరాలు నిండిన యువతులకు వివాహం అయిందనే కారణంతో వందమంది మహిళలకు గత ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిరాకరించిందని, మిగతా సమస్యలు కూడా పరిష్కరించలేదని వారు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ సమస్యలన్నీ తన దృష్టిలో ఉన్నాయని, మీరు ధర్నాలు, దీక్షలు చేసినప్పుడు మీ పక్షాన అండగా ఉండి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని నిలదీశానని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 20 రోజులు అవుతుందని మీరు కొంచెం ఓపిక పడితే త్వరలోనే మీ సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని వారికి భరోసా ఇచ్చారు.అనంతరం వారు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో సర్పంచ్ బద్దం రాజిరెడ్డితో పాటు భూ నిర్వాసితులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించరూ..

అక్కన్నపేట మండలంలోని పెద్దతండాకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆదివారం హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తండావాసులు వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఉపసర్పంచ్ గుగులోతు రాంబాబునాయక్, గిరిజన సంఘం నాయకుడు గుగులోతు భాస్కర్‌నాయక్ తదితరులు ఉన్నారు.



భూ నిర్వాసిత మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న యువతులు

నయా జోష్

- ఘనంగా న్యూఇయర్ వేడుకలు
- అర్ధరాత్రి వరకు యువత జోరు



ఆఫర్లతో మటన్, చికెన్ కర్రీ, చపాతి, బిర్యానీ విక్రయిస్తున్న వ్యాపారులు

చేర్యాల/కొండపాక/గజ్వేల్‌రూరల్, డిసెంబరు 31: సిద్దిపేట జిల్లాలో ఆదివారం నూతన సంవత్సర సందడి నెలకొన్నది. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి 2024 నూతన సంవత్సరాన్ని స్వాగతించేందుకు చిన్నా,పెద్దా తారతమ్యం లేకుండా ఏర్పాట్లు చేసుకున్నారు. కాలనీలలో చిన్నారులు ఆటాపాటలతో సందడి చేశారు. బేకరీలు, మాంసం, మద్యం దుకాణాలు, కుకింగ్ సెంటర్లకు జనం బారులు తీరారు. రంగురంగుల ముగ్గుల అమ్మకాలు జోరుగా సాగాయి. ఆయా దుకాణాల నిర్వాహకులు పోటీపడి ఆఫర్లు పెట్టారు. యువత డీజే సౌండ్ల మధ్య నృత్యాలు చేస్తూ అర్ధరాత్రి వరకు సంబరాల్లో మునిగారు. పలువురు పట్టణ, గ్రామశివారులలోని ఫాంహౌజ్‌లలో మిత్రులతో కలసి ఆనందోత్సాహాలతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.



గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తాలో రంగు ముగ్గుల అమ్మకాలు



చేర్యాల పట్టణంలో కేక్‌ల విక్రయాలు

మల్లన్న ఆలయంలో అందుబాటులోకి లిఫ్ట్

- దివ్యాంగులు, వృద్ధులకు తప్పనున్న ఇక్కట్లు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పనులు పూర్తిచేసి ఏర్పాటుచేసిన లిఫ్ట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, డిసెంబరు 31: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఇక నుంచి దర్శన ఇక్కట్లు తీరనున్నాయి. హైదరాబాద్‌కు చెందిన దాత సహకారంతో ఏర్పాటు చేసిన లిఫ్ట్ పనులను ఇటీవల పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రత్యామ్నాయ నిర్మాణ పనులు చేపట్టినా లిఫ్ట్ బిగింపులో జాప్యం వహిస్తున్న విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'మల్లన్న లిఫ్ట్‌కు మోక్షమెప్పుడో' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు లిఫ్ట్ బిగింపు పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకువచ్చారు. జాతర సమయంలో ఇష్టానుసారం కాకుండా దివ్యాంగులు, వృద్ధులతో ఒకరిని ఎస్కార్ట్‌గా లిఫ్ట్‌లో అనుమతించి స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.



'మల్లన్న' లిఫ్ట్‌కు మోక్షమెప్పుడో?

ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

కరసేవకుల సన్మాన సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

గజ్వేల్, డిసెంబరు 31: కరసేవకుల సన్మాన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీజేపీ కరసేవకుల సమితి సభ్యుడు ఎం.గిరీశ్‌రెడ్డి, డాక్టర్ నరేశ్ బాబు పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో 1990-92 సంవత్సరపు కరసేవకులకు ఉమ్మడి మెదక్ జిల్లా హిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, వివిధ క్షేత్రాల, బీజేపీ కార్యకర్తల సహకారంతో జరిగే సన్మాన సమ్మేళనాన్ని ఈనెల 20 లేదా 24న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన నిర్వహణ కమిటీలను నిర్ణయించడానికి సన్నాహక సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. 1990-92 కరసేవకుల కల శ్రీరామ మందిర పునఃనిర్మాణమని, ఎవరైతే త్యాగధనులు, కరసేవకులు ఉద్యమించి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అయోధ్య కరసేవలో పాల్గొన్నారో వాళ్లందరి కల నెరవేరి 22న రామజన్మభూమిలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారితో నాయకులు ధరం గురువారెడ్డి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ హరినాథ్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, శివాజీ, సంజీవరెడ్డి, కుడిక్యాల రాములు, అడ్వకేట్ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

భర్త మృతితో బావిలో దూకి మహిళ ఆత్మహత్య

జహీరాబాద్, డిసెంబరు 31: భర్త మృతిచెందడంతో బెంగ చెందిన మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జహీరాబాద్ మండలంలోని కాశీంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తమ్మలి మాధవి(38) భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి భర్తపై బెంగతో ఉన్న మాధవి ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుమారుడు వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. జహీరాబాద్ పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా నేలపట్నం గ్రామానికి చెందిన మహేష్(26) లారీ డ్రైవర్. పట్టణంలోని సిద్ధేశ్వరాలయ సమీపంలోని నర్సరీల్లో మామిడి మొక్కలను లారీలో నింపుకునేందుకు ఆదివారం వెళ్లాడు. తాటిపత్రిని తీసుకోవడానికి లారీ క్యాబిన్ మీదకు ఎక్కగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


తూప్రాన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ(ఫైల్)


మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయం

మారిన రాజకీయం

● జిల్లాలో ఆసక్తికరంగా అసెంబ్లీ ఫలితాలు ● మెదక్‌లో బీఆర్ఎస్ కోటకు బీటలు ● నర్సాపూర్‌లో పట్టు నిలుపుకున్న బీఆర్ఎస్


నిందితుడు, ప్రభుత్వ ఉద్యోగి ధర్మా, రెండో నిందితుడు శ్రీనివాస్‌ను మీడియా ఎదుట ప్రవేశపెడుతున్న ఎస్పీ రోహిణీప్రియదర్శిని(ఫైల్)



స్కూటీని టిప్పర్ ఢీకొనడంతో మృతిచెందిన పృథ్వీతేజ్, ప్రణయ్‌తేజ్, రోధిస్తున్న తల్లి అన్నపూర్ణ, కుటుంబసభ్యుల ఫొటో(ఫైల్)


టేక్మాల్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామ శివారులో దగ్ధమైన కారు, కారులోనే సజీవ దహనమైన వ్యక్తి(ఫైల్)


పోలీసుల దెబ్బలకు మృతిచెందిన ఖదీర్‌ఖాన్(ఫైల్)

రౌండప్ 2023
మెదక్ జిల్లా

మెదక్ అర్బన్, డిసెంబరు 31: తీపి జ్ఞాపకాలు, చేదు సంఘటనల సమాహారంగా 2023 నిలిచింది. రాష్ట్ర రాజకీయాల మాదిరిగానే మెదక్ జిల్లా రాజకీయాల్లోనూ ఈ ఏడాది ముఖచిత్రం మారిపోయింది. మెదక్‌లో హస్తం పార్టీ గెలుపొందింది. ఇక నర్సాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేను మార్చి ఇతరులకు టికెట్ ఇచ్చి బీఆర్ఎస్ పట్టు నిలుపుకున్నది.

ఎన్నిక షెడ్యూల్ వెలువడింది మొదలు ఓట్ల లెక్కింపు వరకు నాటకీయ పరిణామాలెన్నో చోటు చేసుకున్నాయి. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో ఎక్కడచూసినా ఎన్నికల సందడే కనిపించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా పార్టీల జాతీయ, రాష్ట్ర నేతలు విచ్చేశారు. నవంబరు 26న తూప్రాన్ ఎన్నికల ప్రచారంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్నారు. నవంబరు 15న మెదక్‌లో 16న నర్సాపూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. నవంబరు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లలో జరిగిన ప్రచార సభలో పాల్గొన్నారు. అక్టోబరు 29న మెదక్‌లో నిర్వహించిన విజయభేరి యాత్రలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. నవంబరు 20న నర్సాపూర్ విజయభేరీ సభకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. నవంబరు 21న మెదక్ రోడ్‌షోలో విజయశాంతి పాల్గొన్నారు. నవంబరు 23న చేగుంటలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ బీజేపీకి మద్దతుగా ప్రచారం చేశారు. నవంబరు 27న బీజేపీకి మద్దతుగా అసోం సీఎం హిమంతబిశ్వాశర్మ రోడ్‌షో నిర్వహించారు.

అభివృద్ధి పనులు.. పథకాల ప్రారంభం

ఆగస్టు 23న మెదక్ జిల్లాకు సీఎం కేసీఆర్ వరాల జల్లు ప్రకటించారు. జిల్లా నూతన కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల ప్రారంభోత్సవం అనంతరం ప్రగతి నివేదన సభలో కేసీఆర్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మెదక్‌కు రింగ్‌రోడ్డు, ఏడుపాయల ఆలయాన్ని గతంలో ప్రకటించిన టూరిజం ప్యాకేజీలో భాగంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మెదక్ జిల్లావ్యాప్తంగా 469 గ్రామపంచాయతీలకు రూ.15 లక్షల చొప్పున నిధులు, మెదక్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, మిగితా మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్‌తోపాటు కౌడిపల్లి, రామాయంపేటలో డిగ్రీ కళాశాలలను మంజూరు చేశారు.

- జూలై 5న జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేస్తూ.. ప్రభుత్వం పరిపాలన అనుమతుల ఉత్తర్వులు జారీచేసింది.
- సెప్టెంబరు 16న 100ఎంబీబీఎస్ సీట్లతో రూ.180 కోట్ల అంచనా వ్యయంతో మెదక్ జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల నిర్మాణానికి అనుమతులు జారీచేసింది.
- జనవరి 19న రెండో విడత కంటివెలుగు కార్యక్రమం ప్రారంభం
- అక్టోబరు 28న ప్రభుత్వ పాఠశాల్లో అల్పాహార పథకాన్ని కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు.
- బీసీబంధు, మైనార్టీ బంధు పథకాల కింద రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు.

ముఖ్యమైన ఘటనలు...

జనవరి 9న బీమా సొమ్ము కోసం హత్య.. టేక్మాల్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామ శివారులో సంచలనం సృష్టించింది. బీమ్లాతండాకు చెందిన సెక్రటేరియట్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పాత్‌లోత్ ధర్మా బీమా సొమ్ము కోసం బాబు అనే వ్యక్తిని హత్య చేసి, మృతదేహాన్ని కారు ముందు పెట్టి పెట్రోల్ పోసి తగులబెట్టాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ధర్మాతోపాటు అల్లుడు శ్రీనివాస్, భార్య నీల, అక్క సునంద, కొడుకు(మైనర్)ను అరెస్టు చేశారు. నిందితులపై 302, 364, 120బి, 201, 202, 212 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

- జనవరి 29న మెదక్ పట్టణానికి చెందిన ఖదీర్‌ఖాన్ దొంగతనం చేశాడని అనుమానిస్తూ.. హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి.. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తీవ్రంగా కొట్టడంతో చికిత్స పొందుతూ ఫిబ్రవరి 9న మృతి చెందాడు. ఈ విషయంలో పట్టణ సీఐ మధు, ఎస్‌ఐ రాజశేఖర్, కానిస్టేబుళ్లు ప్రశాంత్, పవన్‌ను సస్పెండ్ చేశారు.
- ఆగస్టు 24న మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని హైదరాబాద్‌లోని హరీశ్‌రావు ఇంటి ఎదుట మదన్‌రెడ్డి అనుచరులు ధర్నా చేశారు.
- నవంబరు 12న టేక్మాల్ మండల పరిధిలోని కాదులూర్ గ్రామానికి చెందిన అన్నపూర్ణ తన కుమారులు పృథ్వీతేజ్(08), ప్రణయ్ తేజ్(10)లతో కలిసి మెదక్‌లోని జంబికుంటలో నివాసముంటున్నది. దీపావళి సందర్భంగా టపాసుల కోసం అన్నపూర్ణ తన కుమారులతో స్కూటీపై వెళ్తున్న క్రమంలో టిప్పర్ ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరు చిన్నారుల దుర్మరణం చెందారు.
- నవంబరు 16న నర్సాపూర్‌లో కేసీఆర్ పాల్గొన్న ప్రజా ఆశీర్వాద సభలో అస్లాం అనే యువకుడి వద్ద బుల్లెట్లు దొరకడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేగింది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌కు చెందిన అస్లాం చిలప్‌చెడ్ మండల పరిధిలోని చండూర్‌లో చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. అస్లాం 2016లో జోగిపేటలో డిగ్రీ చదువుతున్నప్పుడు ఎన్‌సీసీ విభాగంలో ఖాసీంపూర్‌లో శిక్షణ పొందాడు. అప్పుడే అక్కడి ఓ గదిలో ఉన్న రెండు తుపాకీ బుల్లెట్లను వెంట తెచ్చుకున్నాడు. సభకు బుల్లెట్లను జేబులో పెట్టుకొని రాగా.. పోలీసులు తనిఖీల్లో దొరికాడు. నిందితుడు అస్లాంను అరెస్ట్ చేసి రెండు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.
- డిసెంబరు 4న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన శిక్షణ విమానం(ఫిలాటసర్ పీసీ-7 ఎంకే-2) తూప్రాన్ పరిధిలోని రావెల్లి శివారులో గుట్టపై పడిపోయి, మంటల్లో పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో విమానంలోని పైలట్ (ఇన్‌స్ట్రక్టర్) అభిమన్యురామ్, వియత్నాం దేశానికి చెందిన వువన్‌తైన్ ట్రెయినీ పైలట్ ఇద్దరూ మృతిచెందారు. ఉదయం 8:34 సమయంలో తూప్రాన్ శివారులో గాల్లోంచి ఒక్కసారిగా కిందికి దూసుకొచ్చి, టాటా కాఫీ కంపెనీ సమీపంలో గుట్టపై కూలిపోయింది. మంటలు చెలరేగడంతో పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో అభిమన్యురామ్, వువన్‌తైన్ మృతదేహాలు ముక్కలు, ముక్కలై చెల్లాచెదురుగా పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎయిర్‌ఫోర్స్ కమాండెంట్ శ్రీనివాస్ సహా ఇతర అధికారులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. బెంగళూర్‌కు చెందిన సీఎన్‌సీ నాయర్ హెలికాప్టర్‌లో వచ్చి పరిశీలించారు. మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్‌లో అక్కడి నుంచి తరలించారు.


మెదక్ జిల్లా నూతన కలెక్టరేట్‌ను ప్రారంభిస్తున్న కేసీఆర్ పక్కన హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి(ఫైల్)

- డిసెంబరు 18న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణపై కేసు నమోదైంది. దళితబంధు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేశాడంటూ టేక్మాల్ మండల పరిధిలోని పల్వంచకు చెందిన జంగిడగల్ల భూమయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనతోపాటు నలుగురికి దళితబంధు మంజూరైంది. ఆ డబ్బులు కావాలంటే ఒక్కొక్కరు రూ.3 లక్షల చొప్పున ఇవ్వాలని అప్పటి ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఆయన సోదరుడు రాహుల్‌కిరణ్ డిమాండ్ చేశారు. అందోల్‌లోని క్యాంపు కార్యాలయంలో క్రాంతికిరణ్, రాహుల్‌కిరణ్‌కు రూ.6 లక్షలు ఇచ్చామని భూమయ్య తెలిపాడు. ప్రభుత్వ మారడంతో దళితబంధు ఇప్పిస్తారా.. అని అడిగితే బీఆర్ఎస్ సర్కార్ వచ్చినప్పుడే తీసుకోవాలని క్రాంతికిరణ్ బదులిచ్చారు. తమ డబ్బులు తిగిరి ఇవ్వమని అడిగితే ఆయన అనుచరులతో ఫోన్ చేయించి చంపుతానని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో భూమయ్య పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ రమేష్ వెల్లడించారు.

ఏడాది పొడవునా వెంటాడిన అతివృష్టి

మెదక్ జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 3.45 లక్షల ఎకరాల్లో వరి పంటతోపాటు వివిధ రకాల పంటలు సాగుచేశారు. పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు కురిశాయి. ఏప్రిల్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షాలకు జిల్లావ్యాప్తంగా 12.265 ఎకరాల్లో పంట దెబ్బతింది. పంట నష్టపోయిన రైతులకు రూ.10 వేల చొప్పన పరిహారం అందిస్తామని అప్పట్లో కేసీఆర్ హామీఇచ్చారు. జిల్లాలో రూ.12 కోట్ల 25 లక్షల, 86 వేల పంట నష్టం వాటిల్లిందని అధికారులు గుర్తించారు. బాధిత రైతులకు రూ.8.86 లక్షలు మాత్రమే అందజేశారు. మిగితా రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు.

రుణమాఫీ కోసం ఎదురుచూపులు

కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. జిల్లాలో రూ.లక్షలోపు రుణాలకు 1,50,514 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. ఇప్పటివరకు 73,026 మంది రైతులకు రూ.366 కోట్లు మాత్రమే మాఫీ అయింది. ఇంకా 77,488 మంది రైతులకుగాను రూ.546 కోట్లు మాఫీ కావాల్సి ఉన్నది. నిత్యం బ్యాంకుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తూ.. రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. రైతుబంధు ఇంకా అందలేదు. జిల్లాలో 2,80,949 మంది రైతులు 3,06,437 ఎకరాల్లో వరితో పాటు వివిధ రకాల పంటలు సాగుచేశారు. వీరందరికీ పాత పద్ధతిన ఎకరాకు రూ.5 వేల చొప్పున రూ.200 కోట్ల 71లక్షల 74 వేలు రైతుల ఖాతాల్లో పడాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు కేవలం ఎకరం లోపు ఉన్న 1,11,241 మంది రైతులకు రూ.21కోట్ల 9లక్షల, 81 వేలు జమ చేసినట్లు అధికారిక లెక్కలు పేర్కొంటున్నాయి.

మెదక్ చర్చికి వందేళ్ల చరిత్ర

దశాబ్దాలు గడిచినా చెక్కుచెదరని చారిత్రక కట్టడం.. ఆసియాలోనే రెండో అతిపెద్ద మెదక్ సీఎస్ఐ(చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా). అలనాడు వెలిసిన అద్భుత సౌధం. అందులో అడుగిడితే చాలు ఆధ్యాత్మిక పరిమళాలతో పునీతమవుతాం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చి 99 ఏళ్లు పూర్తి చేసుకొని డిసెంబరు 25న వందేళ్లలో అడుగిడింది. క్రిస్మస్ వేడుకల సందర్భంగా మెదక్ చర్చిలో దశాబ్ది వేడుకలను బిషప్ పద్మారావు ప్రారంభించారు. ఏడాది పొడవునా స్వర్ణోత్సవాలు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. లండన్‌కు చెందిన రెవరెండ్ చార్లెస్ వాకర్ ప్రాస్నేట్ అనే మతగురువు చర్చి నిర్మాణానికి పూనుకున్నాడు. పనికి ఆహారం పథకం కింద ప్రారంభించి.. నిర్మాణంలో అందరూ పాలుపంచుకునేలా స్థానికులకు అవకాశం కల్పించారు. గోతిక్ విధానంలో చేపట్టిన ఈ చర్చి నిర్మాణం 1914లో ప్రారంభమై 1924 డిసెంబరు 25న పూర్తయింది. 350 ఎకరాల విస్తీర్ణంలో 12 వేల మంది కార్మికులు పదేళ్ల శ్రమించి అద్భుత కట్టడాన్ని సాకారం చేశారు. చారిత్రక కట్టడానికి సంబంధించి చర్చి గోపురం ఎత్తు 173 అడుగులు.. పొడవు 200 అడుగులు.. వెడల్పు 100 అడుగులు.. ఈ కట్టడానికి మూడు గవాక్షములు, పలు రంగుటద్ద ములతో ప్రతిష్ఠంపజేశారు. ఇందుకు కావాల్సిన నిధులను ప్రాస్నేట్.. ఇంగ్లండ్ నుంచి విరాళాలు సేకరించారు. అప్పట్లో నిర్మాణానికి రూ.14 లక్షలు ఖర్చు అయినట్లు అంచనా.. అలా మహోన్నత ఉద్దేశంతో శ్రమజీవుల చెమట నుంచి పుట్టిందే మెదక్ చర్చి.


మెదక్ చర్చి వందేళ్ల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బిషప్ పద్మారావు, కమిటీ సభ్యులు


మెదక్ నర్సుఖేడ్‌లో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు(ఫైల్)


కాంగ్రెస్ విజయభేరి యాత్రలో పాల్గొన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి(ఫైల్)


తూప్రాన్ పరిధిలోని రావెల్లి శివారులో గుట్టపై పడిపోయి, మంటల్లో కాలిపోతున్న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ విమానం(ఫైల్)


కొండపాక మండలం మర్పడగలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రం నూతన సంవత్సర క్యాలెండర్‌ను క్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆదివారం ఆవిష్కరించారు.

జిన్నింగ్‌మిల్లును తనిఖీ చేసిన జిల్లా అధికారులు

రాయపోల్, డిసెంబరు 31: దౌల్తాబాద్ మండలం అహ్మద్‌నగర్ శివారులోని కాటన్ జిన్నింగ్ మిల్లు కాంటాను తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ నిర్వహించారు. అహ్మద్‌నగర్‌లోని తిరుమల జిన్నింగ్ మిల్లులో తూకంలో మోసం చేస్తున్నారంటూ రైతులు పత్తి మిల్లు వద్ద శనివారం ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పత్తి మిల్లును తనిఖీ చేసి, కాంటాను సీజ్ చేశారు. కాంటాను లారీ మరియు బాట్లతో తనిఖీ చేయగా తూకంలో సుమారు ఇరవై కిలోల వరకు తేడా వస్తుందని జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీంతో కాంటాను సీజ్ చేశామని పేర్కొన్నారు. తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


అహ్మద్‌నగర్‌లోని తిరుమల జిన్నింగ్ మిల్లులో కాంటాను తనిఖీ చేస్తున్న అధికారులు



నాచగిరి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన నాచగిరి, విద్యాధరి క్షేత్రాలు



నాచగిరి లక్ష్మీనృసింహుడు

వర్గల్, డిసెంబరు 31 : మండలంలోని నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం, వర్గల్ శంభుగిరి కొండలపై వెలసిన శ్రీ విద్యాధరి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. 2023 సంవత్సరం చివరి రోజు కావడంతో ఈ పుణ్యక్షేత్రాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. నాచగిరి క్షేత్రంలో భక్తులు గంటల తరబడి క్యూలైన్ల వద్ద వేచియుండి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. అలాగే విద్యాధరి క్షేత్రంలో విద్యాసరస్వతీ అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్ల వద్ద బారులు తీరారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

మల్లన్న ఆలయంలో భక్తజన సందోహం

● నేటి సాయంత్రం నుంచి మూలవిరాట్టు దర్శనం నిలిపివేత ● 7న కల్యాణం.. అదేరోజు తెల్లవారుజాము నుంచి మళ్లీ దర్శనం





మల్లన్న రాజగోపుర ఆవరణలో భక్తజనసందోహం, పట్నం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

చేర్యాల, డిసెంబరు 31 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. స్వామివారి దర్శనార్థం భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో క్షేత్రం జనసందోహమైంది. భక్తులు కోనేరులో స్నానాలు చేసి, సంప్రదాయబద్ధంగా బెల్లం పాయసం వండి బోనం నివేదించారు. చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించి స్వామివారికి బండారు, పట్టు వస్త్రాలు సమర్పించుకున్నారు. తమ కోరికలను ఈడేర్చాలంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. అలాగే మల్లన్న సహోదరి ఎల్లమ్మతల్లికి కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడిబియ్యం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో బాలాజీశర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మూలవిరాట్టు దర్శనం నిలిపివేత

మల్లన్న కల్యాణం ఈ నెల 7వ తేదీన జరగనున్నందున గర్భాలయం సుందరీకరణ, మూలవిరాట్టును ముస్తాబు చేయడం తదితర కారణాలతో సోమవారం సాయంత్రం నుంచి మూలవిరాట్టు దర్శనాన్ని నిలిపివేస్తున్నట్లు ఈవో బాలాజీశర్మ తెలిపారు. కల్యాణం రోజున తెల్లవారుజామున దృష్టికుంభం నిర్వహించి చత్రకన్ను తంతు అనంతరం భక్తులకు దర్శనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అప్పటి వరకు అర్ధమండపంలో స్వామివారి ఉత్సవ విగ్రహాల దర్శనం ఉంటుంది.

ఆగని లగేజీ బ్యాగుల వసూళ్లు



లగేజీని నిల్వ చేసిన ప్రైవేటు వ్యక్తులు

రాజగోపుర ఆవరణలో పలువురు అనధికార వ్యక్తులు లగేజీ బ్యాగుల నిల్వ పేరిట భక్తుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నా ఆలయాధికారులు చోద్యం చూస్తున్నారు. కొద్దిరోజులక్రితం సంబంధీకులను కౌంటర్ ఏర్పాటు చేయవద్దని మందలించామని అధికారులు చెప్పినా యథావిధిగా కొనసాగిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఎలాంటి రసీదు లేకపోగా, భద్రత లేకపోవడంతో బ్యాగుల్లోని విలువైన వస్తువులను కోల్పోతే బాధ్యత ఎవరు వహిస్తారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా చెప్పుల స్టాండ్‌కు టెండర్ నిర్వహించిన అధికారులు ప్రధానమైన లగేజీల నిల్వను పట్టించుకోకపోవడం శోచనీయం

గజ వాహనంపై అయ్యప్ప స్వామి ఊరేగింపు



సిద్దిపేటలో అయ్యప్ప స్వామి శోభాయాత్రలో మాలధారులు

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 31: అయ్యప్ప స్వామి శోభాయాత్రను ఆదివారం సిద్దిపేటలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప శరణుఘోషతో సిద్దిపేట వీధులు మార్మోగాయి. స్వామిని కీర్తిస్తూ వందలాది మంది అయ్యప్ప మాలధారణ స్వాములు భక్తులు శోభాయాత్రలో పాల్గొన్నారు. సిద్దిపేట కమాన్ గాంధీ చౌక్ విక్టరీ చౌరస్తా మీదుగా కోమటి చెరువు వరకు శోభాయాత్ర కొనసాగింది ఈ సందర్భంగా భక్తులు జలాభిషేకాన్ని ఘనంగా నిర్వహించి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

'యోగా'తో నూతన సంవత్సరానికి స్వాగతం



సిద్దిపేట టౌన్ డిసెంబరు 31: సిద్దిపేటకు చెందిన చిత్రకారుడు కేసరి చక్రపాణి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ యోగాపై వేసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంటున్నది. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలు మాని ఆరోగ్యంగా ఉండేందుకు యోగాభ్యాసం చేయాలని సూచిస్తూ వేసిన చిత్రం ఆలోచింపజేసేవిధంగా ఉంది. 2023 సంవత్సరం కొవ్వొత్తిలా కరిగిపోతూ కొవ్వొత్తిలా వెలిగేలా వేసిన చిత్రం ఉత్సాహం నింపేలా ఉంది

హోటల్‌లో ఆలయ సమీక్ష సమావేశమా.. సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న కొమురవెల్లి జడ్పీటీసీ సిద్దప్ప

చేర్యాల, డిసెంబరు 31: కొమురవెల్లి మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాల సమీక్షా సమావేశాన్ని స్థానికంగా కాకుండా పొరుగు మండలంలోని హోటల్‌లో నిర్వహించడం సిగ్గుచేటని కొమురవెల్లి జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప విమర్శించారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణ పట్ల ఆలయంలోనే అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, కేవలం రాజకీయ దురుద్దేశంతోనే మార్పు చేసి ఆలయ సంప్రదాయాన్ని కాలరాశారన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు మండల ప్రజాప్రతినిధులను అవమానపరచడాన్ని ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడితే తప్పక తమదైన శైలిలో సమాధానం చెబుతామన్నారు. సమావేశంలో ఎంపీపీ తలారి కీర్తన, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ప్రభుత్వం : సీపీఎం

మల్లన్న భక్తుల మనోభావాలను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రొటోకాల్ పాటించకపోవడం తగదని సీపీఎం కొమురవెల్లి మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి పేర్కొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చామని ఇష్టానుసారం వ్యవహరించడం సబబుకాదన్నారు. మినర్వ హోటల్‌లో సమావేశాన్ని నిర్వహించడాన్ని ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, మల్లేశం, సాయిలు పాల్గొన్నారు.

దుద్దెడ శంభు ఆలయ ట్రస్ట్ చైర్మన్ మృతి



రామన్న పంతులు(ఫైల్)

కొండపాక, డిసెంబరు 31: మండలంలోని దుద్దెడ స్వయంభు శంభు దేవాలయ ట్రస్ట్ చైర్మన్ గొల్లపల్లి రామచంద్రమూర్తి శర్మ శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. అంత్యక్రియలు ఆదివారం దుద్దెడలో నిర్వహించారు. శిథిలావస్థలో చేరుకున్న శంభు దేవాలయాన్ని రామన్న పంతులు మార్గదర్శకత్వంలో 2014 నుంచి క్రమంగా అభివృద్ధి చేశారు. గ్రామ అభివృద్ధిలో సైతం ఆయన పాత్ర ఉంది. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

మంత్రి దామోదర్‌ను కలిసిన విశ్రాంత ఉద్యోగులు

జోగిపేట, డిసెబరు 31: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహను ఆయన నివాసంలో అందోలు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రసాద్ జైన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దామోదర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఘనంగా సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షుడు రాధాక్రిష్టాగౌడ్, కోశాధికారి శంకరప్ప, జిల్లా కార్యదర్శి నవీన్‌కుమార్‌గౌడ్, ప్రచార కార్యదర్శి సీహెచ్.వీరేశం, సీనియర్ నాయకులు వై.దుర్గారాం, నర్సింహులు, సదాశివగౌడ్, భూమయ్యగుప్తా, సత్యనారాయణ ఉన్నారు.



మంత్రి దామోదర్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

రసకందాయంలో చేర్యాల మున్సిపల్ 'అవిశ్వాసం'

● ఈ నెల 19న బలపరీక్ష



చేర్యాల మున్సిపల్ కార్యాలయం

చేర్యాల, డిసెంబరు 31 : చేర్యాల మున్సిపల్ చైర్మన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డిపై బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన 9మంది కౌన్సిలర్లు ఇటీవల జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు అవిశ్వాసం నోటీసు అందించిన నేపథ్యంలో అధికారులు బలనిరూపణకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఈ నెల 19వ తేదీని ఖరారు చేస్తూ బల నిరూపణ చేసుకోవాలని తొమ్మిది మందికి నోటీసులు అందించారు. దీంతో చేర్యాల మున్సిపల్ రాజకీయం రసకందాయంలో పడింది. కాంగ్రెస్‌కు ఐదుగురు, బీఆర్ఎస్‌కు ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నప్పటికీ కొంతకాలంగా ఇరువురి పట్ల అసంతృప్తిగా ఉన్న కౌన్సిలర్లు ఎలాగైనా అవిశ్వాసం నెగ్గించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఈ విషయమై రేపు సమావేశమై క్యాంపునకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ నుంచి ఉడుముల ఉన్నమ్మ, బీఆర్ఎస్ నుంచి జుబేదా కాటూన్ చైర్‌పర్సన్ పదవి కోసం పావులు కదుపుతున్నారు. స్వతంత్రంగా గెలిచిన జుబేదా కాటూన్‌కు రెండున్నరేళ్ల తరువాత చైర్మన్ అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో బీఆర్ఎస్‌కు మద్దతు పలికింది. కానీ ప్రస్తుతం బీఆర్ఎస్‌లో నెలకొన్న పరిణామాలతో కాంగ్రెస్ కౌన్సిలర్లు సహకరిస్తేనే ఆమెకు అవకాశం దక్కనుంది. ఇదే క్రమంలో అధికారంలోకి వచ్చినందున చైర్మన్ అవకాశం 'చే'జారిపోకూడదని కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తున్నా ఏడాది పదవీకాలానికి ఆర్థికపరభారం మోయాల్సి వస్తుందని ఒకరిద్దరు వెనుకడుగు వేస్తున్నారన్న ప్రచారం సాగుతున్నది.

ప్రొటోకాల్ వార్ ప్రభావితం చేస్తుందా?

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మధ్యన నియోజకవర్గంలో ప్రొటోకాల్ వార్ కొనసాగుతున్నది. ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలపడంతో పాటు కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీక్షా సమావేశాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బహిష్కరించారు. దీంతో ఒకరిపై మరొకరు అగ్గిమీద గుగ్గిలంలా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతానికి ఇరుపార్టీలలో ఎవరు చైర్మన్, వైస్‌చైర్మన్ కావాలన్నా ఒకరికి మరొకరి సహకారం లేనిదే నెరవేరని పరిస్థితి నెలకొన్నది. అవిశ్వాస విషయంలో ప్రొటోకాల్ వార్ ఏ మేరకు ప్రభావితం చేయనుందని చర్చించుకుంటున్నారు. మున్సిపల్‌లో పాగా కోసం ఇరుపార్టీల అధినేతలు, కౌన్సిలర్లు ఎలాంటి చర్యలకు ఒడిగడతారన్న విషయం ఈ నెల 19న తేలనుండటంతో ఆసక్తిరేపుతుంది.

కోమటి చెరువు వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 31: సిద్దిపేట కోమటి చెరువు ఫ్రెండ్లీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పల్లె బాలకిషన్ గౌడ్‌ను అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆదివారం గౌరవ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా కెమ్మసారం రాజేష్, ఉపాధ్యక్షులుగా పల్లె భాస్కర్ గౌడ్, గంధం కరుణాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా బొల్గం అంజయ్య గౌడ్, కోశాధికారిగా చుక్క చంద్రం, ప్రచార కార్యదర్శిగా కొలమద్ది విజయసాగర్, అడ్వయిజర్ కమిటీ సభ్యులుగా మెర్గు యాదగిరి, మిద్దె రవి, పిండి అరవింద్, నాయిని జయపాల్ రెడ్డి, కెమ్మసారం దుర్గయ్య, కొండ రాజులను ఎన్నుకున్నారు.

టీయూడబ్ల్యూజే అధ్యక్షుడికి సన్మానం



టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీని సన్మానిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

గజ్వేల్, డిసెంబరు 31: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఖాజా విరాహత్ అలీని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవెల్లి మల్లికార్జున్, మర్కుక్ మండలం టీపీటీఎఫ్ అధ్యక్షుడు విద్యాధర్‌రెడ్డి, ములుగు మండల అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్ ఘనంగా సన్మానించారు. సికింద్రాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం వారు ఆయనతో కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం



అలీనగర్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

ములుగు, డిసెంబరు 31: ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ములుగు మండలం అలీనగర్ గ్రామంలో ఆదివారం నూతనంగా పార్టీ గ్రామకమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఎగురవేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చబోతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొమురయ్య గ్రామకమిటీ అధ్యక్షుడు రాములుగౌడ్, మాజీ సర్పంచ్‌లు భూపాల్‌రెడ్డి, నయిమొద్దీన్, ప్రవీణ్‌రెడ్డి, సింగం రాజు, కొండు నర్సింహులు ఉన్నారు.

శివకుమార్‌కు అవార్డు ప్రదానం

నారాయణఖేడ్, డిసెంబరు 31: మండల పరిధిలోని అనంత్‌సాగర్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును అందుకున్నారు. 20 నెలల కాలంలో వెయ్యి రావి ఆకులపై సందర్భాలను బట్టి వినూత్నంగా చిత్రాలను వేసినందుకు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఫౌండర్ కె.ఎల్లేష్‌కుమార్ చోటును కల్పించారు. ఆదివారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అవార్డును శివకుమార్‌కు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దారంశంకర్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, పరమేష్ పాల్గొన్నారు.

హుగ్గెల్లిలో మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

జహీరాబాద్, డిసెంబరు 31: మండల పరిధిలోని హుగ్గెల్లి గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయ ఆవరణలో స్వామివారి కల్యాణ మహోత్సవం ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. గొల్లబీర్ల కళాకారుల ఆట,పాటలతో మార్మోగింది. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు హుగ్గెల్లి రాములు, గ్రామసర్పంచ్ రాజు, ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ కిషన్ పాల్గొన్నారు. మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో మాజీమంత్రి చంద్రశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు

కొత్వాన్‌పల్లిలో..

రేగోడు, డిసెంబరు 31: మెదక్ జిల్లా రేగోడు మండలంలోని కొత్వాన్‌పల్లి గ్రామంలో ఆదివారం మల్లికార్జున స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద అగ్నిగుండం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి మల్లికార్జునస్వామి ఆలయానికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజు పాల్గొన్నారు.

దేవునిపల్లి మల్లన్నగుట్ట జాతర

కల్హేర్, డిసెంబరు 31: సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామ శివారులో దేవునిగుట్టపై వెలసిన మల్లన్నస్వామి ఆలయ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు యాదవ సంఘం సభ్యులు, నాయకులు స్వాగతం పలికారు. ఉత్సవాల్లో వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ దిలీప్ కుమార్, దేవునిపల్లి సర్పంచ్ సులోచన భూపాల్, మాసాన్‌పల్లి మాజీ సర్పంచులు గోపాల్, మోహన్‌రెడ్డి, కిష్టాగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాదవరెడ్డి, తుకారాం, సంగమేశ్వర్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యాదవసంఘం ఆధ్వర్యంలో..

నర్సాపూర్: నర్సాపూర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లికార్జునస్వామి ఆలయ ఉత్సవాలు ఆదివారం రెండోరోజు కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు

కోహీర్, డిసెంబరు 31: మండల కేంద్రమైన కోహీర్‌లోని హజ్రత్ సయ్యద్ మౌలానా మోహీజొద్దీన్ ఉర్సులో భాగంగా ఆదివారం దర్గా వద్ద నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. కుస్తీ పోటీలకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన మల్లయోధులతో పాటు హైదరాబాద్‌కు చెందిన దాదాపు 50 మంది మల్లయోధులు పాల్గొన్నారు. గెలుపొందిన మల్లయోధులకు ఉర్సు కమిటీ సభ్యులు నగదుతో పాటు ట్రోఫీలను అందజేశారు. అంతకుముందు పలువురు కుస్తీ పోటీలను ఉద్దేశించి మాట్లాడుతూ అంతరించిపోతున్న కుస్తీ పోటీలను ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో పాశురాల పఠనం



ఆలయంలో పాశురాలను పఠిస్తున్న మహిళా భక్తులు

చేర్యాల, డిసెంబరు 31 : చేర్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ధనుర్మాసం 16వరోజును పురస్కరించుకుని విశేష పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి ద్రవిడ భాషలో పాశురాలను పఠించారు.

గజ్వేల్‌లో రోడ్డెక్కిన కూరగాయల మార్కెట్

● రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన సమీకృత మార్కెట్ వృథా ● అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం





గజ్వేల్ పట్టణంలో మార్కెట్ రోడ్డుపైనే విక్రయిస్తున్నకూరగాయలు, గజ్వేల్‌లోని సమీకృత మార్కెట్

గజ్వేల్, డిసెంబరు 31: గజ్వేల్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి సమీకృత మార్కెట్ ఏర్పాటు చేసినా ఫలితం లేకుండాపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కూరగాయల వ్యాపారులు తిరిగి రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవడంతో పాటు మార్కెట్‌లోని వ్యర్థాలతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశాలున్నాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో పట్టణంలో రోడ్లపైనే కూరగాయలు, ఇతర తినుబండారాలు విక్రయించేవారు. కానీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు రోడ్లపై ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రోడ్లపై కూరగాయల స్టాండ్స్‌ను పెట్టనీయలేదు. ఇందుకోసం ప్రత్యామ్నాయంగా పూలు, పండ్లు, కూరగాయలు, మాంసం, అన్ని ఒకే చోట దొరికేలా రూ.30కోట్ల వ్యయంతో పట్టణ నడిబొడ్డున సమీకృత మార్కెట్‌ను నిర్మించారు. సమీకృత మార్కెట్‌లో స్టాళ్లను ఏర్పాటు చేయించారు. అవసరమైన వారికి స్టాళ్లను కేటాయించారు. సమీకృత మార్కెట్‌కు వెళ్తే వాహనం నిలిపి, అక్కడి నుంచి నడుస్తూ వెళ్లి కూరగాయలు తీసుకొని వెళ్లడం ప్రజలకు ఇబ్బందిగా మారింది. దీంతో వ్యాపారాలు తగ్గిపోతున్నాయని, తాము బతికేదేలా అంటూ చిరు వ్యాపారులు గత కొన్నాళ్లుగా మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహరించడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇటీవల ప్రభుత్వం మారడం, అధికారులు పట్టించుకోకపోవడం తదితర కారణాలతో చిరువ్యాపారులు తిరిగి రోడ్డుపైనే దుకాణాలు నడుపుకుంటున్నారు. ప్రస్తుతం యథేచ్ఛగా రోడ్డుపై వ్యాపారాలు ఏర్పాటు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన సమీకృత మార్కెట్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పాల కల్తీలో నిజమెంత?

● రెండు రోజులుగా 110క్యాన్ల పాలు నేలపాలు
● సిద్దిపేట సిబ్బంది టెస్టింగ్‌లో కానరాని కల్తీ
● బీసీయూ ఇన్‌చార్జి తీరుపై అనుమానాలు
● న్యాయం కోసం పాడిరైతుల వేడుకోలు





చేర్యాలలో పాలశీతలీకరణ కేంద్రం, కల్తీ ఉందంటూ నేలపాలు చేస్తున్న పాలు

చేర్యాల, డిసెంబరు 31 : అధిక ధర పొందడానికి పాడి రైతులు పాలల్లో ఉప్పు, చక్కర కలిపి కల్తీచేస్తున్నారన్న విషయమై చేర్యాల పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రంలో రెండు రోజులుగా సుమారు 5వేల లీటర్ల పాలు నేలపాలు చేసిన విషయమై రకరకాల సందేహాలు తలెత్తుతున్నాయి. తాము ముమ్మాటికీ కల్తీ చేయడం లేదని రైతులు, టెస్టింగ్ చేస్తే కల్తీ తేటతెల్లమవుతుందని డెయిరీ అధికారులు చెబుతున్నప్పటికీ స్థానిక సిబ్బంది టెస్టింగ్ చేస్తే ఒక విధంగా, సిద్దిపేట నుంచి వచ్చిన సిబ్బంది చేస్తే మరోవిధంగా ఫలితం వస్తుండటం కలకలం రేపుతున్నది. దీంతో తప్పు ఎవరిదో తేల్చుకోలేకపోతుండటం చర్చనీయాంశంగా మారింది. చేర్యాల పట్టణంలోని పాల శీతలీకరణ కేంద్రానికి చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి మండలాల్లోని 48 సెంటర్ల నుంచి నిత్యం 10వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం హైదరాబాద్‌కు పంపించిన పాలను టెస్ట్‌చేయడంతో కల్తీ చేశారని తిరస్కరించారు. రెండురోజులక్రితం మద్దూరు, కొమురవెల్లి మండలానికి చెందిన పలు గ్రామాలలో సేకరించిన పాలను స్థానిక కేంద్రంలో టెస్టింగ్ చేయడంతో కల్తీ అయ్యాయని కేంద్రం ఇన్‌చార్జి మురళి తిరస్కరించారు. రెండు రోజుల్లో 110క్యాన్ల పాలు సుమారు 4,500లీటర్లను పారబోయడంతో రైతులు సుమారు రూ.1.50లక్షలు. నష్టపోయారు.

లోపభూయిష్టంగా శాంపిల్ టెస్టులు!

పాల కేంద్రానికి వచ్చిన పాలను క్యాన్లవారీగా టెస్టింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ అన్నింటినీ కలిపి టెస్టింగ్ చేయడంతో ఏ ఒక్కరు కల్తీచేసినా ఇతర రైతుల పాలను కూడా నేలపాలు చేస్తుండటం వివాదాస్పదమైంది. కేంద్రానికి రాగానే శాంపిల్ తీసినా, టెస్టింగ్ చేయడంలో జాప్యం వహించినా, లోపభూయిష్టంగా టెస్ట్ నిర్వహించినా ఫలితం తారుమారు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ విషయంలో బీసీయూ ఇన్‌చార్జి మురళి వైఖరిపై రైతులు మండిపడటంతో ఉన్నతాధికారులు సిద్దిపేట నుంచి సిబ్బందిని రప్పించి క్షేత్రస్థాయిలో పాలు పితికి పరిశీలించగా ఎలాంటి కల్తీ కనిపించలేదు. శనివారం రాత్రి డెయిరీ డీడీ సమక్షంలో పరిశీలించారు. అలాగే ఆదివారం సిద్దిపేట సిబ్బందితో తనిఖీ చేయించినా ఎలాంటి తేడా రాకపోవడంతో స్థానిక సిబ్బంది తీరుపై అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి స్థానిక డెయిరీ నిర్వాహకులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని, అకారణంగా నేలపాలు చేసిన పాలకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

రెండు రోజులు తిరస్కరిస్తే సెట్‌రైట్ అయింది

సాధారణంగా బల్క్ క్వాంటిటీనే పరిశీలిస్తాం. తేడా రావడంతో అన్నిపాలు రిజెక్ట్ చేశాం. రెండురోజుల పాటు పాలు తిరస్కరించడంతో అంతా సెట్‌రైట్ అయింది. ఆ కారణంగా పాలునష్టపోయిన విషయమై రైతులకు డెయిరీ నుంచి పరిహారాన్ని అందిస్తాం. ఆదివారం క్యాన్లవారీ టెస్ట్ చేస్తే ఎలాంటి తేడా రాలేదు.

\- మురళి, బీసీయూ ఇన్‌చార్జి